

అర్హులందరికీ నాణ్యమైన

రేషన్ బియ్యం

ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

7

డ్రైవరన్నా.. జర పైలం

అప్రమత్తతే శ్రీరామరక్ష

జాగ్రత్తలతో ప్రమాదాలను నివారణ

అతివేగానికి కళ్లెం, మత్తుకు దూరం

ప్రయాణికులూ అప్రమత్తంగా ఉండాలని సూచన

7

రామ్‌మందిర్‌లో మాధవానంద స్వామి

ఆశ్రమం ఏర్పాటు పనులు వేగవంతం చేయండి

రాంనగర్ భజన మండలికి సూచించిన జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పాత బస్టాండ్ సమీపంలోని రాంనగర్ రామ్ మందిరంలో మాధవానంద స్వామి ఆశ్రమం ఏర్పాటు పనులు వేగవంతం చేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి రాంనగర్ భజన మండలికి సూచించారు. మాధవానంద స్వామితో కలిసి మంగళవారం ఆయన జగ్గారెడ్డి రామ్ మందిరంలో ఏర్పాట్లను పరిశీలించారు. రామ్ మందిర్‌లో మాధవానంద స్వామి భక్తులతో సత్సంగ్ చేసేందుకు, భక్తులను కలిసేందుకు వీలుగా తగిన ఏర్పాటు చేయాలన్నారు. ఆలయంలో ఆశ్రమం నీటి అవసరాలు తీర్చేలా తక్షణమే బోరు బేయించి నీటి ట్యాంకు నిర్మించాలని సూచించారు. ఆశ్రమంలో నిర్వహించే పూజా కార్యక్రమాలకు అనుకూలంగా ఉండేలా ప్రత్యేకంగా వసతులు కల్పించాలని జగ్గారెడ్డి పేర్కొన్నారు.



మాధవానందస్వామితో మాట్లాడుతున్న జగ్గారెడ్డి



రామ్‌మందిర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాధవానంద స్వామి, జగ్గారెడ్డి

అక్రమంగా తరలిస్తున్న 295 క్వింటాళ్ల

రేషన్‌బియ్యం స్వాధీనం



జహీరాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యం

జహీరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి చౌరస్తాలోని బసవేశ్వరచౌక్ మీదుగా మంగళవారం అక్రమంగా తరలిస్తున్న 295 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామని జహీరాబాద్ రూరల్ ఎస్సై కాశీనాథ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జీజే27-టీజీ0019 నంబరు లారీ హైదరాబాద్ నుంచి జహీరాబాద్ మీదుగా గుజరాత్‌కు వెళ్తున్నది. హుగ్గెల్లి చౌరస్తావద్ద వాహనాలను తనఖీలు చేస్తున్న క్రమంలో లారీని ఆపీ తనిఖీ చేయగా రేషన్ బియ్యం రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. గుజరాత్ రాష్ట్రానికి చెందిన రోజక గ్రామానికి చెందిన భావరియ (లారీడ్రైవర్), మోటగోగరివాడకు చెందిన ఇస్మాయిల్ (లారీ యజమాని) హైదరాబాద్ పరిసరప్రాంతాల్లో లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలుచేసి గుజరాత్‌కు తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనానికి, బియ్యానికి సంబంధించి ఎలాంటి పత్రాలు లేనందున నిందితులను అదుపులోకి తీసుకుని లారీని, రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషన్‌బియ్యం విలువ సుమారు రూ. 9.44 లక్షలు ఉంటుందని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

కంకర ధరలపై ఎఫెక్ట్

చేవెళ్ల రోడ్డు ప్రమాదం అనంతరం టన్నుకు రూ. 170 పెంపు

ఇంత కాలం రాయల్టీకి గండి

తనిఖీలు చేస్తుండటంతో

వినియోగదారుల నుంచి వసూలు

నిలిచిపోయిన కొనుగోళ్లు, అమ్మకాలు

తూప్రాన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల రోడ్డు ప్రమాదం ఎఫెక్ట్ కంకర ధరలపై పడింది. ఇంతకాలం అధికారుల ఉదాసీనత, చేతివాటం కారణంగా ప్రభుత్వానికి అందాల్సిన రాయల్టీకి గండి పడగా.. తప్పనిసరై తనిఖీలు చేయడంతో కంకర మిషన్ల యజమానులు ఇప్పుడు ఆ భారం వినియోగదారులపైనే మోపుతున్నారు. చేవెళ్ల బస్సు ప్రమాదానికి కారణమైన టిప్పర్‌లో పరిమితికి మించి కంకర రవాణా చేస్తున్నట్లు బయటపడింది. దీంతో ప్రభుత్వం ఆదేశాలమేరకు అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఎంత మైనింగ్ చేస్తున్నారు, లారీల్లో ఎంత నింపుతున్నారనే దానిపైనే కాకుండా ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీ చెల్లింపుపై దృష్టిపెట్టారు. తనిఖీలతో గగ్గోలు పెడుతున్న కంకర మిషన్ల యజమానులు ఆ భారాన్ని వినియోగదారులపైనే మోపుతుండటంతో తెల్లారే సరికి ధరలు పెరిగిపోయాయి. తూప్రాన్ డివిజన్ పరిధిలోని కంకరమిషన్ల వద్ద నిన్నటి వరకు డస్ట్, రోబో సాండ్ ధర టన్ను రూ. 340 నుంచి రూ. 350 వరకు విక్రయించారు. 20 ఎంఎం కంకర టన్నుకు రూ. 450, 40 ఎంఎం కంకర టన్నుకు రూ. 400కు విక్రయించారు. అయితే మంగళవారం ధరలు అమాంతం 50 శాతం వరకు పెంచేశారు. అధికారుల తనిఖీలు, ఆన్‌లైన్ వేబిల్స్ పరిశీలనతో అక్రమ దందా చేసే వీలు లేకపోవడంతో రాయల్టీ ఫీజు చెల్లించాల్సి వచ్చింది. నిన్నటితో పోలిస్తే డస్ట్, రోబో సాండ్ టన్నుకు ధర రూ. 170 పెంచి రూ. 520కు విక్రయించారు. 20 ఎంఎం కంకర ధర రూ. 620, 40 ఎంఎం కంకర రూ. 570కు పెంచారు. ఇదేమని కొనుగోలుదారులు అడిగితే రాయల్టీ ఫీజు కలిపినట్లు చెప్పారు. దీంతో కొనుగోలుదారులు నిలిచిపోయారు. మెటల్ సప్లయ్ చేసే వ్యాపారులు, టిప్పర్ యజమానులు రవాణాను నిలిపేశారు. దీంతో, ఇంతకాలం ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీ ఎగ్గొట్టారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మెటల్ ధర ఒక్కసారిగా టన్నుకు రూ. 170 పెంచడంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రభావం చూపనుంది.





హైవే భద్రమేనా?

ఎన్‌హెచ్65పై ప్రయాణమంటేనే హడల్

నత్తనడకన విస్తరణ పనులు

ఇరుకు రోడ్డు.. అడుగడుగునా గుంతలు

కనిపించని ప్రమాద సూచికలు

అతివేగంగా దూసుకెళ్తున్న వాహనాలు

సంగారెడ్డి క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల వద్ద ప్రమాదంతో హైవే 65పై భద్రతపై అనుమానాలు తలెత్తుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలో 65వ నంబరు జాతీయ రహదారి విస్తరణ పనులు నత్తనడక సాగుతున్నాయి. హైదరాబాద్ నగర శివారులోని లింగంపల్లి నుంచి సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి వరకు ఆరు లేన్లుగా విస్తరిస్తున్నారు. పనులు ప్రారంభమై సంవత్సరమైనా ఇంకా ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లు మారింది. రూ.800 కోట్ల అంచనాతో గత సంవత్సరం జూలైలో ప్రారంభమైన పనులను 2026 జూలై నెలాఖరు లోపు పూర్తి చేయాల్సి ఉంది. కానీ, అండర్‌పాస్‌లు, బ్రిడ్జిలు, కల్వర్టులు తదితర పనుల్లో జాప్యం కొనసాగుతోంది. దీంతో ఆయా ప్రదేశాల్లో రోడ్డు ఇరుకుగా మారింది. నిర్మాణ సామగ్రి రోడ్డు మధ్యలోనే ఉంచడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. నిర్మాణ పనులు కొనసాగుతుండటంతో రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. విస్తరణ కోసం రోడ్డుకు ఇరువైపులా తవ్వేయడంతో ప్రమాదకరంగా తయారైంది. వర్షం కురిసినప్పుడు రోడ్డు ఇరువైపులా, మధ్యలో ఉన్న గుంతల్లో నీరు నిలిచి వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి.

ట్రాఫిక్ నరకం

జాతీయ రహదారి విస్తరణ పనులతో పోతిరెడ్డిపల్లి నుంచి పటాన్‌చెరు వరకు ప్రయాణం నరకప్రాయంగా మారింది. హైవే 65 హైదరాబాద్-ముంబయి మధ్య మహారాష్ట్ర, కర్ణాటకలను కలిపే ప్రధాన రహదారి కావడంతో చిన్నాపెద్ద వాహనాలు నిత్యం లక్షల్లో రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రైవేట్ ట్రావెల్స్, లారీలు, కంటెయినర్ల వంటి భారీ వాహనాలు పెద్దసంఖ్యలో వెళ్తుంటాయి. ఇరుకుగా మారిన రోడ్డుపైనే ట్రావెల్స్ లారీలు నిర్లక్ష్యంగా, వేగంగా వెళ్తుండటంతో బైకులు, ఆటోలు, కార్లలో వెళ్లేవారు భయంభయంగా నడుపుతున్నారు. డ్రైవర్లు మద్యం మత్తులో మిగతా 6వ పేజీలో

హైవేపై బ్లాక్‌స్పాట్లు ఇవే

సంగారెడ్డి జిల్లాలోని హైవే-65పై బ్లాక్‌స్పాట్లను పోలీసులు గుర్తించారు. పటాన్‌చెరు ఆర్టీసీ బస్టాండ్, ముత్తంగి వద్ద స్వీట్‌హార్ట్ హోటల్, ముత్తంగి గ్రామం, ఇస్నాపూర్ చౌరస్తా, లక్డారం గ్రామ గేట్, నోవాపాన్ చౌరస్తా, రుద్రారం గ్రామాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించారు. సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కవలంపేట, కంది, జమ్‌జమ్ దాబా, పోతిరెడ్డిపల్లి చౌరస్తా, కొండాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కాపూర్ చౌరస్తా, సదాశివపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సదాశివపేట ఆర్టీసీ బస్టాండ్, నందికంది, ఎంఆర్ఎఫ్ కాలనీ, కోహీర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దిగ్వాల్ గ్రామాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించారు. కానీ సూచికా బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు షరామామూలుగానే మారాయి.

ప్రమాదాల నివారణకు చర్యలు

హైవే విస్తరణ పనుల్లో జాప్యం కారణంగా ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. పనులు సకాలంలో పూర్తయితే ప్రయాణం సులువుగా మారుతుంది. రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలని హైవే అథారిటీ అధికారులతో చర్చించాం. పనులు కొనసాగుతున్న ప్రాంతాల్లో సూచికా బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించాం. ట్రాఫిక్ నిలిచిపోకుండా నిత్యం పోలీసులుశాఖ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

-పరితోష్ పంకజ్, సంగారెడ్డి ఎస్పీ

టీవీవీపీలో డిప్యూటేషన్ల

దందాపై విచారణ

హైదరాబాద్ డీసీహెచ్‌ఎస్ ఆధ్వర్యంలో 25 మంది విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగారెడ్డి అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'వైద్య శాఖలో పైసా వసూల్' అనే శీర్షికన గత నెల 27 వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డా.అజయకుమార్ స్పందించారు. సమగ్ర విచారణ బాధ్యతలను ఆదేశించారు. హైదరాబాద్ డీసీహెచ్‌ఎస్ సుర్యశ్రీరావుకు విచారణ బాధ్యతలు అప్పగించారు. మంగళవారం ఆమె సంగారెడ్డిలోని టీవీవీపీ జిల్లా కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఉదయం 10 గంటల నుంచి 10 గంటల పాటు ఆమె విచారణ జరిపారు. వార్త పత్రిక, సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన ఆడియో, వీడియో సంభాషణల ఆధారంగా ప్రమేయం ఉన్న ఒక్కొక్కరిని డీసీహెచ్‌ఎస్ గదిలోకి పిలిపించి వ్యక్తిగతంగా విచారణ చేశారు. నెలన్నర వ్యవధిలో డిప్యూటేషన్లు ఇచ్చిన సుమారు 45 మందిని విచారణకు పిలిపించగా, ఇందులో సుమారు 25 మంది నుంచి లిఖిత పూర్వక వివరణ తీసుకున్నారు. విధులకు రాకున్నా జీతాలు మంజూరు చేసేందుకు ఎవరైనా డబ్బులు తీసుకుంటున్నారా అని ఆరా తీశారు. విచారణ అధికారి అడిగిన ప్రశ్నలకు కొందరు సమాధానాలు చెప్పలేక మౌనంగా ఉన్నట్టు తెలిసింది. ఈరోజు గైర్హాజరైన జహీరాబాద్ ఆసుపత్రి సిబ్బంది నలుగురిని శుక్రవారం హైదరాబాద్‌కు రావాలని సూచించినట్లు తెలిసింది. అనంతరం ఆమె టీవీవీపీ కమిషనర్‌కు నివేదికను అందించనుంది.

కానిస్టేబుల్‌కు

గన్ ఎలా వచ్చింది?

సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ సీరియస్

పటాన్‌చెరు సీఐ ఆధ్వర్యంలో సమగ్ర విచారణ

సంగారెడ్డి క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ కె.సందీప్ కుమార్ ఆత్మహత్య చేసుకునేందుకు పోలీస్‌స్టేషన్ నుంచి రివాల్వర్ ఎలా తీసుకువెళ్లగలిగారని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ సీరియస్ అయ్యారు. గన్ వాడేందుకు అర్హత లేని కానిస్టేబుల్ పోలీస్‌స్టేషన్‌లో అత్యంత భద్రత మధ్య ఉండే 9ఎంఎం రివాల్వర్‌ను బయటకు తీసుకెళ్లి కాల్చుకొని సోమవారం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అయితే 9 ఎంఎం రివాల్వర్ బయటకు ఎలా వెళ్లింది? కానిస్టేబుల్ తీసుకెళ్తున్నప్పుడు మిగతా సిబ్బంది ఏం చేస్తున్నారు? సోమవారం స్టేషన్‌లో ఎవరెవరు ఏ విధుల్లో ఉన్నారు? ఆయుధాలను భద్రపర్చే గది ఇన్‌చార్జి ఎవరు? ఆయన తాళం ఎక్కడ పెట్టాడు? అది కానిస్టేబుల్‌కు ఎలా లభించింది? అన్న విషయాలపై విచారణకు ఆదేశించారు.

విచారణ అధికారిగా పటాన్‌చెరు సీఐ

కానిస్టేబుల్ సందీప్‌కుమార్ ఆత్మహత్యకు పాల్పడటానికి ఉపయోగించిన రివాల్వర్ ఎలా వచ్చిందో తెలుసుకొనేందుకు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పటాన్‌చెరు సీఐ వినాయక్‌రెడ్డిని విచారణ అధికారిగా నియమించారు. ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి తనకు నివేదిక సమర్పించాలని ఆదేశించినట్లు తెలిసింది. ఎస్పీ ఆదేశాల మేరకు పటాన్‌చెరు సీఐ వినాయక్‌రెడ్డి విచారణ ప్రారంభించారు. సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండల కేంద్రానికి చెందిన కె సందీప్ కుమార్ గత సంవత్సరం కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. అప్పటి నుంచి ఆయన సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసైన సందీప్ కుమార్ ఇంట్లో ఉన్న బంగారం మొత్తం అమ్ముకోవడంతో పాటు, స్నేహితుల వద్ద దాదాపు రూ.20లక్షల వరకు అప్పులు చేశాడని తెలుస్తోంది. అప్పులు ఇచ్చిన వారు తిరిగి ఇవ్వాలని వత్తిడి తీసుకురావడంతో కానిస్టేబుల్ సందీప్ ఆత్మహత్య చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చి రివాల్వర్‌ను ఎవరికి తెలియకుండా పోలీస్‌స్టేషన్ నుంచి అపహరించుకు పోయినట్లు పోలీసు అధికారులు భావిస్తున్నారు. అయితే స్టేషన్‌లో అత్యంత భద్రంగా ఎప్పుడూ తాళం వేసి ఉండే ఆయుధాల గదిలో ఉన్న రివాల్వర్ ఎలా తీసుకున్నాడు, ఆయుధాల గది తాళం చేతులు కానిస్టేబుల్ కు ఎవరైనా ఇచ్చారా? లేక ఆయనే ఎవరికి తెలియకుండా తీసుకున్నాడా? అనే విషయాలపై విచారణ జరుగుతున్నదని తెలిసింది. కానిస్టేబుల్ సందీప్ కుమార్ ఆత్మహత్య చేసుకోవాలనుకుంటే చాలా మార్గాలు ఉన్నాయని, రివాల్వర్ దొంగిలించి దానితో కాల్చుకొని ఆత్మహత్య చేసుకోవడంతో అతనికే కాకుండా పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే సిబ్బందికి కూడా ఇబ్బంది కరంగా మారిందని ఒక పోలీసు అధికారి వ్యాఖ్యానించారు.

రెండో రోజు

కేంద్ర బృందం తనిఖీలు

సంగారెడ్డి అర్బన్/నారాయణ్‌ఖేడ్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కామన్ రివ్యూ మిషన్ బృందం రెండో రోజు సంగారెడ్డి జిల్లాలో విస్తృతంగా పర్యటించింది. రెండు బృందాలుగా వారు మంగళవారం సంగారెడ్డి జనరల్ ఆస్పత్రి, పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రి, ఆర్‌సీపురం పీహెచ్‌సీ, తెల్లాపూర్ బస్తీదవాఖానా, అంగన్‌వాడీ సెంటర్లు, నారాయణ్‌ఖేడ్ ఏరియా ఆస్పత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఆయా కేంద్రాల్లో రోగులకు అందుతున్న వైద్యసేవలు, నాణ్యతా ప్రమాణాలు, మందుల నిల్వలు, ప్రసవాలు, ఎన్‌హెచ్‌ఎం నిధుల వినియోగం, ఎన్‌సీడీ స్క్రీనింగ్, పేషెంట్ కేర్, రికార్డుల నిర్వహణతో పాటు కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. కార్యక్రమంలో బృందం సభ్యులతో పాటు ప్లానింగ్ పీవో జగన్నాథ్‌రెడ్డి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.నాగనిర్మల, డీఐవో, జీజీహెచ్ సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

ఇందిరమ్మా..

ఇదేం తీరు..!

బిల్లుల చెల్లింపులో మార్పు.. ఉపాధిహామీ నుంచి రూ. 60 వేలు

పట్టణాల్లో అమలులో లేని పథకం

ఆందోళనలో లబ్ధిదారులు

మెదక్ అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి బిల్లుల చెల్లింపుల్లో సర్కార్ చేసిన మార్పులు లబ్ధిదారులను అయోమయానికి గురిచేస్తున్నాయి. విడతల వారీగా వారికిచ్చే రూ. 5 లక్షల్లో ... రూ.60 వేలను ఉపాధిహామీ ద్వారా చెల్లిస్తామని ప్రకటించింది. ఇళ్ల నిర్మాణ పనులకు ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానించింది. అయితే, కూలీల పని దినాలకు సర్కార్ చెల్లిస్తామన్న నగదుకు పొంతన కుదరడంలేదు. మరోవైపు మెదక్ మున్సిపల్ పరిధిలో ఉపాధిహామీ పథకం అమలు కావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో లబ్ధిదారులకు ఎలా బిల్లులు చెల్లిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇందరమ్మ ఇళ్లు నిర్మించుకునేవారికి ప్రభుత్వం నాలుగు విడతల్లో ఆర్థికసాయం అందిస్తుంది. బేస్మెంట్ స్థాయిలో రూ.లక్ష, రూఫ్ లెవెల్‌లో మరో రూ.లక్ష, స్లాబ్ లెవెల్‌లో రూ.2 లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తయ్యాక మరో రూ.లక్ష చొప్పున ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది.

బిల్లుల చెల్లింపు దశలో మార్పు

ఇటీవల స్లాబ్ లెవెల్‌లో జమ చేసే రూ.రెండు లక్షల నిధుల విడుదలలో స్వల్ప మార్పులు చేసింది. రూ 2 లక్షలకు గాను రూ. 1.40 లక్షలే లబ్ధిదారుల ఖాతా జమ చేస్తామని ప్రకటించింది. మిగితా రూ. 60 వేలను ఈజీఎస్ నుంచి విడుదల చేస్తామని గృహనిర్మాణశాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి గత నెల 27న ప్రకటించారు. ఈమేరకు స్లాబ్‌లెవెల్ బిల్లులో సర్కార్ రూ.60 వేలు కోత విధించింది. జాబ్‌కార్డు కలిగిన లబ్ధిదారులకు తమ ఇంటి వద్ద నిర్మాణ పనులు చేసుకున్నందుకు 90 రోజుల పని దినాలు లెక్కించి నగదు అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రోజుకు రూ.307 చొప్పున లెక్కేసుకుంటే 90 రోజులకు రూ.27,630 మాత్రమే అవుతుంది. వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణానికి స్వచ్ఛ భారత్ మిషన్(ఎస్‌బీఎం) ద్వారా రూ. 12 వేలు అందించనుంది. ఈ రెండింటి నగదు కలిపితే రూ.39.630 అవుతుంది. మరో రూ.20.370 నగదును ఏ ప్రాతిపదికన చెల్లిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై హౌసింగ్ పీడీ మాణిక్యం స్పందిస్తూ పట్టణ ప్రాంతాల్లో ప్రధాన మంత్రి అవాస్ యోజన నిధులు జమ చేసే అవకాశం ఉందన్నారు.



పొడ్చన్‌పల్లిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

క్రమశిక్షణతోనే గెలుపు

నరేంద్రుడి బాటలోనే ప్రధాని మోదీ

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాలకు భారతదేవ విశ్వగురువులుండాలని నాటి నరేంద్రుడు చెప్పిన మాటలను నేటి నరేంద్రుడు ప్రధాని మోదీ నిజం చేస్తున్నారని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాలు, సైన్స్ మేళాను ఎంపీ ప్రారంభించారు. స్వామీ వివేకనందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థులు జీవితంలో గెలవాలంటే క్రమశిక్షణ ఒక్కటే మార్గమన్నారు. బట్టీ చదువులకు స్వస్తి పలికి విశ్లేషణాత్మకంగా చదవాలని సూచించారు. ప్రపంచ క్రీడల్లో మన దేశం వెనుకంజలో ఉందని, యువత క్రీడల్లో దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కృషిచేయాలన్నారు.



ఉత్సాహంగా ఉత్సవాలు

మెదక్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సహాలు ఉత్సాహంగా జరిగాయి. విద్యార్థులు శాస్త్రీయ, జానపద నృత్యాలు, మోడరన్ డ్యాన్స్ చిత్రలేఖనం, బృంద నృత్యాలు, వక్తృత్వం, సాంస్కృతిక ప్రదర్శనలతో కనువిందు చేశారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను ప్రధానం చేశారు. కార్యక్రమంలో న్యాయనిర్ణేతలు, డీఎస్వో రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్

సంగారెడ్డి డీఎంహెచ్‌వోగా వసంతరావు

నాలుగేళ్ల అనంతరం జిల్లాకు రెగ్యులర్ వైద్యాధికారి




డాక్టర్ వసంతరావు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నాలుగేళ్ల ఇన్‌చార్జి పాలన అనంతరం సంగారెడ్డి జిల్లాకు రెగ్యులర్ డీఎంహెచ్‌వోను నియమించారు. సంగారెడ్డి జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారిగా డా.ముదిలి వసంతరావు నియమితులయ్యారు. ఈ మేరకు హెల్త్ సెక్రటరీ డా.క్రిస్టినా జడ్ చోంగ్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో డిప్యూటీ సివిల్ సర్జన్ హోదాలో ఆర్‌ఎంవోగా విధులు నిర్వహిస్తున్న వసంతరావుకు సివిల్ సర్జన్‌గా (జనరల్ లైన్) పదోన్నతి కల్పించి సంగారెడ్డి డీఎంహెచ్‌వోగా నియమించారు. ఆయన గతంలో రాజన్నసిరిసిల్ల డీఎంహెచ్‌వోగా, పెద్దపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేశారు. ఒకట్రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరిస్తానని డా.వసంతరావు 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు. అలాగే, కోహీర్ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న డా.జి.గాయత్రీదేవీకి కూడా సివిల్ సర్జన్‌గా పదోన్నతి కల్పించి హైదరాబాద్‌లోని పేట్లబురుజు మెటర్నిటీ ఆస్పత్రి సీఎస్ ఆర్‌ఎంవోగా నియమించి బదిలీ చేశారు. నారాయణఖేడ్ డిప్యూటీ డీఎంహెచ్‌వో సంధారాణి కూడా సివిల్‌సర్జన్ పదోన్నతిపై హైదరాబాద్‌లోని మెంటల్‌హెల్త్ హాస్పిటల్‌కు ఆర్‌ఎంవోగా బదిలీ అయ్యారు.







డప్పు కొట్టడానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం


మల్లయ్య (ఫైల్)

రాయపోల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో రాజకీయ పార్టీల ప్రచారం కోసం డప్పు కొట్టడానికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మల్లమొల్ల మల్లయ్య(50) ఐదు రోజుల క్రితం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో డప్పు కొట్టేందుకు హైదరాబాద్‌కు వెళ్లాడు. ఆదివారం అమీర్‌పేట నాగార్జున కాలనీలో డప్పు కొడుతున్న సమయంలో బీడీ తాగడానికి పక్కకు వెళ్లాడు. అనంతరం ఎంతకూ తిరిగి రాకపోవడంతో మిగతావారు ఎంత వెతికినా ప్రయోజనంలేకుండా పోయింది. బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.







వడ్ల కుప్పను ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

చిన్నశంకరంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వడ్ల కుప్పను ఎక్సల్ వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన చిన్నశంకరంపేట మండలం సంగాయిపల్లి గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలకు వెళ్తే మడూర్ గ్రామానికి చెందిన పోతరాజు శ్యాములు గవ్వలపల్లి గ్రామానికి ఎక్సల్ వాహనంపై బయలు దేరాడు. సంగాయిపల్లి శివారు గవ్వలపల్లి, రామాయంపేట రోడ్డుపై రైతులు వడ్లను ఆరబోశారు. ప్రమాదవశాత్తు వడ్ల కుప్పను ఢీకొని తలకు తీవ్రగాయాలు, రక్త స్రావం అయింది. స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని 108 అంబులెన్సులో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

కల్తీ ఆహార వస్తువుల తయారీ కేంద్రాలపై దాడులు

జహీరాబాద్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిజిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఐడీఎస్ఎంటీ కాలనీ, హమాలీ కాలనీ తదితర ప్రాంతాల్లో కల్తీ ఆహార వస్తువులను తయారుచేస్తున్న తయారీ కేంద్రాలపై జహీరాబాద్, చిరాగ్‌పల్లి ఎస్సై వినయ్‌కుమార్, రాజేందర్‌రెడ్డిలు తమ సిబ్బందితో కలిసి మంగళవారం మూకుమ్మడిగ దాడులు చేశారు. అందులో భాగంగ ఆయా తయారీ కేంద్రాల్లో ఎలాంటి ఆహారపదార్థాలు తయారుచేసున్నారని, ఎలాంటి రామెటీరియల్ వాడుతున్నరని వారు గమనించారు. వారు కల్తీ ఆహారవస్తువులను తయారుచేస్తున్నందున వారిపై కేసులు నమోదుచేశామని వారు వివరించారు. పరస్, అభినయశ్రీ తయారీ కేంద్రాలు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయని వారు పేర్కొన్నారు. కల్తీ ఆహార పదార్థాలను వాడుతూ పిండివంటలు తయారుచేస్తు ప్రజారోగ్యాలకు హానికలిగించేలా వ్యవహరిస్తున్నారని వారు స్పష్టం చేశారు. ఆయా తయారీ కేంద్రాల నిర్వాహకులు పరస్‌నాథ్, పేరుమాల్‌లపై కేసునమోదు చేసిదర్యాప్తు చేస్తున్నామని వారు వివరించారు.





బంగారు గొలుసును దొంగిలించిన యువకుడి అరెస్టు

హైదరాబాద్ సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న యువతి మెడలోంచి బంగారు గొలుసును దొంగలించిన నిందితుడిని రామచంద్రాపురం పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం మాదాపూర్ అదనపు డీసీపీ ఎస్.ఉదయ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరువులోని శ్రీరాం నగర్ కాలనీకి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని, ఆమె తల్లితో కలిసి గత నెల 27వ తేదీన రామచంద్రాపురంలోని డైమండ్ పాయింట్ వద్దకు ఆటోలో వచ్చింది. తల్లిని ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు వెళ్లే బస్సు ఎక్కించేందుకు వచ్చి, తిరిగి వెళ్తోంది. ఇంజనీరింగ్ విద్యార్థిని రోడ్డు దాటుతుండగా ఓ యువకుడు ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును బలవంతంగా లాక్కెళ్లిపోయాడు. దీంతో ఆ యువతికి మెడకు గాయమైంది. యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన రామచంద్రపురం పోలీసులు నిందితుడి కోసం సీసీ టీవీ కెమెరాలను పరిశీలించారు. బంగారు గొలుసు దొంగను పట్టుకునేందుకు ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసి గాలించారు. చివరకు నిందితుడు సంగారెడ్డిలోని శాంతినగర్ ప్రాంతానికి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే సయ్యద్ అబ్దుల్లా (31)గా పోలీసులు గుర్తించారు. అతడి వద్ద నుంచి బంగారు గొలుసుతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిని రిమాండు చేశామని అదనపు డీసీపీ ఎస్.ఉదయ్ రెడ్డి తెలిపారు.

బొలెరో వాహనం ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి


పోగుల యాదగిరి (ఫైల్)

హుస్నాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మంగళవారం ఉదయం సైకిల్‌పై వెళ్తున్న పోగుల యాదగిరి (63)ని వెనుక నుంచి వస్తున్న బొలెరో వాహనం ఢీ కొట్టడంతో మృతి చెందాడు. తెలిపారు. ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని జ్యోతినగర్‌కు చెందిన యాదగిరి పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట హోటల్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. హోటల్‌కు సైకిల్‌పై వస్తుండగా హైదరాబాద్‌కు చెందిన ఐస్‌క్రీం సప్లయ్ చేసే బోలెరో వాహనం కరీంనగర్ నుంచి హుస్నాబాద్ మీదుగా హన్మకొండకు వెళ్తూ వెనుక నుంచి అతి వేగంగా వచ్చి సైకిల్‌ను ఢీ కొట్టి 30 అడుగుల దూరం ఈడ్చుకెళ్లింది. దీంతో యాదగిరి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందినట్లు ఎస్సై చెప్పారు. యాదగిరి కుమారుడు పోగుల శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

కల్హేర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కల్హేర్ శివారులోని పాత చెరుకు ఫ్యాక్టరీ ఆవరణలో వడ్ల సత్తయ్య(50) అనుమానాస్పద స్థితిలో మరణించాడు. కల్హేర్ ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నిత్యం తాగుడుకు బానిస అయిన సత్తయ్య ఫ్యాక్టరీ ఆవరణలో విగత జీవిగా పడి ఉండటాన్ని గ్రామస్థులు మంగళవారం ఉదయం పోలీసులకు సమచారమందించారు. జీవితంపై విరక్తి చెంది మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి ఉండవచ్చునని, లేదా ఇంకేదైనా కారణంతో మరణించాడేమోనని అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నారాయణఖేడ్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై వివరించారు.

నిర్లక్ష్యపు డ్రైవింగ్.. వృద్ధురాలు బలి

● రోడ్డు దాటుతుండగా ఢీ కొట్టిన జేసీబీ

కంది, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నిర్యక్ష్యపు డ్రైవింగ్‌కు ఓ వృద్ధురాలి నిండు ప్రాణం బలితీసుకున్న సంఘటన మండలకేంద్రమైన కందిలోని లక్ష్మీనగర్ కాలనీ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. సంగారెడ్డి రూరల్ ఎస్సై మధుసూదన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కందిలోని లక్ష్మీనగర్ కాలనీలో నివాసముంటున్న ఎగ్మె కస్తూరి (60) కంది నుంచి ఇంటికి వెళ్లాడానికి కంది ఆర్టీఏ కార్యాలయం వద్ద రోడ్డుదాటడానికి వెళ్తున్న క్రమంలో ఓ క్రేన్ డ్రైవర్ నిర్యక్ష్యంగా క్రేన్‌ను నడుపుతూ ఆమెను ఢీ కొట్టాడు. దీంతో తలకు బలమైన గ్రాయాలై తీవ్ర రక్తస్రావం జరిగి కస్తూరి అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో ఒక్కసారిగా భయభ్రాంతులకు గురైన క్రేన్ డ్రైవర్ క్రేన్‌లో నుంచి దూకి పరారయ్యాడు. డ్రైవర్‌ని అదుపులోకి తీసుకుని అతడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుసూదర్ రెడ్డి తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని చిన్నారి మృతి


సాహితి (ఫైల్)

గజ్వేల్ రూరల్ నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనలు ఢీకొని బాలిక మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం లింగారాజ్ పేటలో మంగళవారం చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్కుక్ మండలం పాముల పర్తి గ్రామానికి చెందిన చిన్నబోయిన స్వామి కూతురు సాహితి(7) , కుమారుడు శ్రీ హర్ష(10) లను తన ద్విచక్ర వాహనంపై అత్తవాళ్ల ఇంటికి తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో గౌరారం నుంచి ముట్రజ్ పల్లికి వెళ్తున్న మార్గంలో ద్విచక్ర వాహనం వీరి వాహనాన్ని ఢీకొట్టడంతో స్వామి వాహనం పై ఉన్న సాహితి తల పగిలి అక్కడిక్కడే మృతి చెందింది. శ్రీ హర్ష, స్వామికి తీవ్ర గాయాలయ్యాయి, పోస్టు మార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి సాహితి మృత దేహాన్ని తరలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వివాహం ఇష్టం లేక..


మౌనిక (ఫైల్)

గజ్వేల్ రూరల్ నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇష్టం లేని వివాహం చేస్తున్నారని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారంసిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ పట్టణంలోని భరత్ నగర్‌కు చెందిన కడారీ మౌనిక (19) కు చేర్యాలకు చెందిన బాలరాజుతో ఈనెల 16న వివాహం నిశ్చయమైంది. కాని మౌనికకు ఇష్టం లేదు. నేను వివాహం చేసుకోను అని తల్లిదండ్రలుకు తెలిపింది. ఈ క్రమంలో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో వంట గదిలోని రేకుల రాడ్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది . ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు స్థానికల సహాయంతో గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందిందని ధ్రువీకరించారు . కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసున్నామని పోలీసులు తెలిపారు.

కోహెడలో పోలీసుల తనిఖీ

కోహెడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నార్కోటిక్ డాగ్స్‌తో గంజాయి ఇతర మత్తుపదార్థాల నివారణాపై కిరాణా షాపులు, టీ కొట్టులు, ఇతర అనుమానాస్పద ప్రాంతాలలో ఎస్సై అభిలాష్ ఆధ్వర్యంలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్లు ఎవరైనా కలిగి ఉన్నా, అక్రమంగా రవాణా చేసినా పాన్ షాపులు, ఇతర షాపులలో అమ్మినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోహెడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండలం తంగళ్ళపల్లి గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగు నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై అభిలాష్ తెలిపారు. యాటెల్లి శ్రీనివాస్ అనే వ్యక్తి టీజీ 36 టి 5554 లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రైవరన్నా.. జర పైలం

అప్రమత్తతే శ్రీరామ రక్ష

- జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ
- అతివేగానికి కళ్లెం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి
- ప్రయాణికులూ అప్రమత్తంగా ఉండాలని సూచన

మెదక్ కల్చరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇటీవలి కాలంలో చోటుచేసుకుంటున్న బస్సు ప్రమాదాలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. డ్రైవర్లు చేసే చిన్న చిన్న పొరపాట్లు.. అజాగ్రత్తలే అతని ప్రాణాలతో పాటు ప్రయాణికుల ప్రాణాలకు కూడా ముప్పుగా మారుతుంది. అందుకే డ్రైవర్లు వాహనం నడిపేటప్పుడు ఎంతో జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. తాజాగా కర్నూలులో జరిగిన బస్సు దుర్ఘటనలో మెదక్ జిల్లాకు చెందిన తల్లి కూతురు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ సంఘటన డ్రైవర్ల అప్రమత్తత ఎంత అవసరమో మరోసారి గుర్తు చేసింది. ముఖ్యంగా రాత్రి వేళల్లో డ్రైవింగ్ చేసేటప్పుడు అలసట, నిద్ర కారణంగానే చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని నివేదికలు చెబుతున్నాయి. డ్రైవర్లు తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రాణనష్టం, ప్రమాదాల తీవ్రతను తగ్గించవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

డ్రైవర్లు తీసుకోవాల్సిన కీలక జాగ్రత్తలివే..

- డ్రైవింగ్ చేస్తుండగా నిద్ర వచ్చినట్లు అనిపిస్తే, వెంటనే వాహనాన్ని రోడ్డు పక్కన సురక్షిత ప్రాంతంలో ఆపి, కాసేపు నడవాలి లేదా తేలిక పాటి వ్యాయామం చేయాలి. ముఖంపై నీళ్ల చల్లుకుని, టీ/కాఫీ/స్నాక్స్ తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.
- రహదారులపై నిర్దేశించిన వేగ పరిమితిలోనే డ్రైవింగ్ చేయాలి. భయం లేదా అసౌకర్యంగా అనిపిస్తే వేగం తగ్గించుకోవాలి. పరిమిత వేగంలో ప్రయాణించడం ఉత్తమం.



- డ్రైవింగ్‌లో పూర్తిగా ఏకాగ్రతతో ఉండాలి. స్మార్ట్‌ఫోన్‌ను అస్సలు ఉపయోగించకూడదు. పాటలు విన్నా, శబ్దం మరీ ఎక్కువగా లేకుండా చూసుకోవాలి. బయటి శబ్దాలు వినిపించేలా కిటికీని కొద్దిగా తెరిచి ఉంచడం మంచిది.

పొగమంచులో...

పొగమంచులో ఓవర్‌టేక్ చేయవద్దు. మంచులో దూరాన్ని అంచనా వేయడం కష్టం కాబట్టి ఓవర్‌టేక్ చేయడం ప్రమాదకరం. అటువంటి సమయంలో లో-బీమ్ హెడ్‌లైట్‌ను ఉపయోగించాలి. హై-బీమ్ లైట్లు మంచు తుంపరలపై పడి రిఫ్లెక్ట్ అయి, ఎదురుగా వచ్చే వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తాయి. టెయిల్ లైట్, బ్లింకర్స్‌ను ఉపయోగించడం ద్వారా ఎదురుగా వచ్చే వాహనదారులకు ఇబ్బంది కలగదు.

- రోడ్డుపై ఇతరులను గౌరవిస్తూ, ఓపికగా డ్రైవ్ చేయాలి. ఎవరైనా రోడ్డు దాటుతున్నప్పుడు వేగం తగ్గించి వారికి అవకాశం ఇవ్వాలి.
- దారి మారుతున్నప్పుడు, టర్నింగ్ తీసుకునేటప్పుడు, పార్కింగ్ నుంచి బయటకు వచ్చేటప్పుడు వెనుక వచ్చే వాహనదారులను అప్రమత్తం చేసేందుకు సరైన ఇండికేటర్లను తప్పకుండా ఉపయోగించాలి.
- ముందు, వెనుక వచ్చే వాహనాల నుంచి తగినంత దూరం పాటించాలి. దీనివల్ల అకస్మాత్తుగా బ్రేక్ వేయాల్సి వచ్చినా ప్రమాదం జరగకుండా చూసుకోవచ్చు.
- డ్రైవర్లు మత్తు పదార్థాలు, మద్యపానానికి దూరంగా ఉండాలి. వాహనం నడిపేటప్పుడు మానసిక ఆందోళన లేకుండా ప్రశాంతంగా ఉండాలి.
- వాహనాలు ఎల్లప్పుడూ మంచి కండిషన్‌లో ఉండేలా చూసుకోవాలి. రెగ్యులర్ మెయింటెనెన్స్ చేయడం ద్వారా ప్రయాణంలో రిపేర్లు రాకుండా నివారించవచ్చు.

ప్రయాణికులకు సూచనలివే..

- బస్సు బయలుదేరే ముందు డ్రైవర్లు టైర్ల కండిషన్, స్టీరింగ్, డీజిల్ ట్యాంక్ పరిస్థితి, అత్యవసర ద్వారాలు సక్రమంగా ఉన్నాయో లేదో తప్పకుండా తనిఖీ చేయాలి.
- దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో ఇద్దరు డ్రైవర్లు కచ్చితంగా అందుబాటులో ఉండేలా చూడాలి.
- ప్రైవేటు ప్రయాణ వాహనాలను కార్గోలుగా ఉపయోగించడం సరికాదు. ఎలక్ట్రానిక్ వస్తువులు, అదనపు లోడు వంటివి బస్సులో తరలించడం వల్ల ప్రమాద సమయంలో అగ్నిప్రమాదాలు మరింత తీవ్రమవుతాయి. వేగంగా వెళ్లే సమయంలో అదనపు లోడు వల్ల బస్సులు అదుపు తప్పే అవకాశం ఉంది.
- అత్యవసర ద్వారం వద్ద స్లీపర్ సీట్లు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదం జరిగినప్పుడు బయటపడడం కష్టమవుతుంది. ప్రయాణికులు అత్యవసర ద్వారాలు, అద్దాలను పగులగొట్టే పరికరాల గురించి ముందుగా తెలుసుకోవాలి.



డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి...

వాహన డ్రైవర్లు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. ఓవర్ స్పీడ్‌లో వెళ్లకూడదు. తాము ఒక్కరి ప్రాణాలకే కాకుండా, తోటి ప్రయాణికుల కుటుంబ బాధ్యతను కూడా గుర్తెరిగి వాహనం నడపాలి. వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు సక్రమంగా కలిగి ఉండాలి.

\- వెంకటస్వామి, మెదక్ జిల్లా రవాణా శాఖ అధికారి

మర్పడగ క్షేత్రంలో వైకుంఠ చతుర్దశి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కొండపాక, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో మంగళవారం వైకుంఠ చతుర్దశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం ఆరున్నర గంటలకు విజయదుర్గా మాతకు విశేష పంచామృత ఫలరస అభిషేకం నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం స్వామివారికి రుద్రాభిషేకం, సుబ్రహ్మణ్య స్వామికి విశేష పంచామృత ఫలరస అభిషేకం నిర్వహించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టు వద్ద కార్తీక దీపారాదనచేశారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్తీక పౌర్ణమి రోజున సాయంత్రం నుంచి కార్తీక దీపోత్సవం, జ్వాలా తోరణం ఉంటుందని క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ తెలిపారు. భక్తులు పాల్గొని దైవకృప పొందాలని సూచించారు.

నేటి నుంచి రామలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు

కొండపాక, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కొండపాక ఆనంద నిలయం ఆవరణలో గల అష్టాదశ శక్తిపీఠ సహిత రామలింగేశ్వర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలు నేటి నుంచి జరగనున్నాయి. ఆలయ ఆవరణలో కాలభైరవ, వీరభద్ర, చండీశ్వర ప్రతిష్ఠామహోత్సవ నిర్వహించున్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలలో నిత్యం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు, ట్రస్ట్ అధ్యక్షుడు అయిత నాగరాజు తెలిపారు. రోహిణి నక్షత్ర యుక్త ధనుర్లగ్న పుష్కరాంశమున శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య విద్యాశంకరభారతీ మహాస్వామి వారి కరకమలాలచే యంత్ర ప్రతిష్ఠ, విగ్రహస్థాపన తదితర కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

'సీపీఐ నేతపై చర్యలు తీసుకోవాలి'

బర్కత్‌పుర, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బెదిరింపులకు గురిచేస్తున్న సీపీఐ నేతపై చర్యలు తీసుకోవాలని బాధితుడు తూటి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం చంచల్ చెరువుపల్లి గ్రామానికి చెందిన తనకు వారసత్వంగా వచ్చిన ఎకరం నాలుగు గుంటల పొలం ఉందన్నారు. ఈ పొలానికి సంబంధించిన సమస్య ఉండడంతో సిద్దిపేట జిల్లా సీపీఐ నేత పవన్‌ను సంప్రందించినట్లు తెలిపారు. సమస్య పరిష్కరిస్తానని తన వద్ద రూ.3,06,700 తీసుకున్నాడని తెలిపారు. అయినా సమస్యను పరిష్కరించలేదని, దీంతో తానే నేరుగా కలెక్టర్, తహసీల్దార్‌ను కలిసి సమస్యను పరిష్కరించుకున్నానని తెలిపారు. తన డబ్బులు తిరిగి ఇవ్వాలని పలుమార్లు కోరినా ఇవ్వకపోవడమే కాక బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. దీనిపై ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఇతర సీపీఐ నేతలకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదన్నారు. సీపీఐ నేత పవన్‌పై సిద్ధిపేట టూ టౌన్ పీఎస్‌లో కూడా ఫిర్యాదు చేశానని తెలిపారు. ఇప్పటికైనా తన డబ్బులు తనకు ఇప్పించాలని కోరారు.

అర్హులందరికీ నాణ్యమైన రేషన్ బియ్యం అందాలి

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి



నర్సాపూర్‌లో రేషన్ దుకాణానికి తనిఖీ చేస్తున్న కమిషన్ బృందం

నర్సాపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ నాణ్యమైన రేషన్ అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయనతోపాటు సభ్యులు పట్టణంలోని రేషన్ దుకాణం పరిశీలించారు. అనంతరం ఎంఎల్ఎస్ పాయింట్ గోదాం, రెడ్డిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల తనిఖీ చేశారు. తమకు గోదాం నుంచి బియ్యం తూకంలో తక్కువగా వస్తున్నాయని, తద్వారా నష్టపోతున్నట్లు డీలర్లు వారి దృష్టికి తెచ్చారు. దీంతో అక్కడ ఉన్న బియ్యం సంచిని తూకం వేసి కిలో తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. తమకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ కమీషన్ వచ్చేలా చూడాలని రేషన్ డీలర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, సభ్యులు వారికి విన్నవించారు. రెడ్డిపల్లిలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతగా లేదని, నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని డీఈవో రాధాకిషన్‌కు కమిషన్ చైర్మన్ ఆదేశించారు. వారి వెంట డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌రావు, ఆర్డీవో మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

● పాపన్నపేట/మెదక్ కల్చరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయాన్ని, మెదక్ సీఎస్ఐ చర్చిని మంగళవారం ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు సందర్శించారు. ప్రత్యేక పూజలు, ప్రార్థనం చేశారు.

బిల్లు రాలేదని పంచాయతీ కార్యాలయంలో మకాం

- గ్యాస్ స్టవ్, నిత్యావసరాలు, పడకమంచంతో లబ్ధిదారుడి వినూత్న నిరసన
- కేసు నమోదు చేసిన పోలీసులు
- సిద్దిపేట జిల్లా తోటపల్లి గ్రామంలో ఘటన

హుస్నాబాద్ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ బిల్లు ఇవ్వడం లేదని, అందుకు పంచాయతీ కార్యదర్శిని బాధ్యుడిగా చేస్తూ ఓ యువకుడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉంటానని పడక మంచం, గ్యాస్ స్టవ్, వస్తువులు పెట్టి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశాడు. ఈ సంఘటన తోటపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామానికి చెందిన శాతవేని ఎల్లేంద్ర పేరున ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 600 స్క్వేర్ పీట్లలోపు ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేసుకోవాలని నిబంధనలు ఉన్నాయి. తోటపల్లి గ్రామంలో 17 మంది నిబంధలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారు. బిల్లురావడానికి ఇబ్బంది ఏర్పడుతుందని, నిబంధనలకు లోబడి ఇంటి నిర్మాణం చేసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. దీంతో 15 మంది నింబంధనలకు లోబడి ఇంటి నిర్మాణాలు చేసుకుని బిల్లులు పొందారు. ఎల్లేంద్ర మాత్రం 750 పీట్లకు మించి ఇంటి నిర్మాణం చేపట్టడంతో మొదట బేస్మెంట్ లెవల్‌కు రూ. 1 లక్ష వరకు బిల్లులు చెల్లించారు. అయితే 600 పీట్లకు లోబడి ఇంటిని నిర్మించుకోవాలని చెప్పినా వినకుండా ఇంటి స్లాబ్ వేసుకొన్నాడు దీంతో మిగతా బిల్లు చెల్లించాలని పంచాయతీ కార్యదర్శిని ఎల్లేంద్ర కుమారుడు మహేందర్ నిత్యం వేధిస్తున్నాడు. తాను ఏమీ చేయలేనని పై అధికారుల ఆదేశాల మేరకే పని చేస్తానని చెప్పడంతో మంగళవారం మహేష్ పంచాయతీ కార్యాలయంలో పడక మంచం, గ్యాస్ స్టవ్, నిత్యావసర వస్తువులు పెట్టాడు. దీనిపై పంచాయతీ కార్యదర్శి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు వచ్చి పంచాయతీ కార్యాలయంలోని వస్తువులను తొలగించారు. ఈ మేరకు మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.



గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంచం, గ్యాస్ స్టవ్ పెట్టిన దృశ్యం

జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



కావ్యను అభినందిస్తున్న అధ్యాపక బృందం

సిద్దిపేట కల్చరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న బరిగే కావ్య జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల చౌటుప్పల్‌లో నిర్వహించిన అండర్-18 మాస్టర్ విభాగంలో గోల్డ్ మెడల్, టైం ట్రయల్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించి బేష్ అనిపించుకుంది. నవంబరు 15న ఒడిశాలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఆమె పాల్గొననుంది. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ రెడ్డి, అధ్యాపక బృందం కావ్యను శాలువాతో సత్కరించి, అభినందించారు. కార్యక్రమంలో చిన్నకోడూరు కళాశాల ప్రిన్సిపాల్ కూచంగారి శ్రీనివాస్, ఏజీఎంసీ దేవయ్య, స్టాఫ్ సెక్రటరీ సుధాకర్ రెడ్డి, స్టూడెంట్ కౌన్సిలర్ కనక చంద్రం, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ నంట శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నగేష్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి అశోక్, కోచ్ వెంకటేష్, అధ్యాపకులు వెంకటరమణ, రఘురాజ్, శ్రీకాంత్, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు జట్ల ఎంపిక



ఎంపికైన మహిళ జట్టు

తూప్రాన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లా సీనియర్ జట్లను ఎంపిక చేసినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరికిషన్, శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాలలో మంగళవారం ఎంపిక నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 101 మంది పురుషులు, 49 మంది మహిళలు మొత్తం 150 మంది హాజరయ్యారని తెలిపారు. ఇందులో 15 మంది పురుషులు, 15 మంది మహిళలను ఉమ్మడి మెదక్ జిల్లా జట్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈనెల 6 నుంచి 9 వరకు పెద్దపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో పాల్గొంటారని వివరించారు. కోశాధికారి నాగగౌడ్, సంయుక్త కార్యదర్శి త్రిశూల్, రాముగౌడ్, ఉపాధ్యక్షులు మిద్దింటి నవీన్, రవి, ప్రకాష్, మహేష్ పాల్గొన్నారు.

కపాస్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

టేక్మాల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కపాస్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం టేక్మాల్ రైతు వేదికలో శంకరంపేట-ఏ డివిజన్ పరిధిలోని వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. డివిజన్ పరిధిలో మొత్తం 21,193 మంది రైతులు 34,903 ఎకరాలలో పత్తి పంటను సాగు చేశారన్నారు. రైతులు దళారులకి అమ్మి మోసపోకుండా జిన్నింగ్ మిల్లుకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. పత్తి కొనుగోలు కేంద్రాలను మానిటరింగ్ చేసేందుకు ఏఎంసీల వారీగా లోకల్ కమిటీలను నియమించి, ఎప్పటికప్పుడు రైతులు మద్దతు ధర పొందేలా కృషి చేయాలన్నారు. అదే విధంగా లీగల్ మెట్రాలజీ అధికారులు తేమ కొలిచే యంత్రాలను పరిశీలించాలన్నారు. అనంతరం వంద శాతం రాయితీపై జొన్న విత్తనాలను రైతులకు అందించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్, ఇన్‌చార్జి ఏడీఏ రాంప్రసాద్, ఆయా మండలాల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

పత్తిని పాత పద్ధతిలోనే కొనుగోలు చేయాలి

మునిపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : కపాస్ యాప్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, పాత పద్ధతిలో పత్తిని కొనుగోలు చేయాలని రాయికోడ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీష్ కుమార్, మాజీ ఎంపీపీ రాంరెడ్డి అన్నారు. మంగళవారం మునిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్మార్ట్ ఫోన్లు లేక కొంత మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఒక్కో రైతుకు ఎన్ని సర్వే నెంబర్లు ఉంటే అన్నింటికీ ఓటీపీలు రావడంతో తిప్పలు తప్పడం లేదని అన్నారు. గతేడాదాది ఎకరాకు 12 క్వింటాళ్లు కొనుగోలు చేసిన సీసీఐ, ఈసారి 7 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రసూల్ పటేల్, నాయకులు సంగమేశ్వర్, విఠల్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు

సగం రోడ్డు సంతకే..!

- అలంకారప్రాయంగా గజ్వేల్ సమీకృత మార్కెట్
- ఫుట్‌పాత్‌లు, రోడ్డు ఆక్రమణతో వాహనదారులు, పాదాచారులకు తీవ్ర ఇక్కట్లు
- తైబజార్ వ్యాపారులతో అధికారులు కుమ్మక్కు..!

గజ్వేల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోట్లు వెచ్చించి మార్కెట్‌ను నిర్మించినా, కూరగాయల వ్యాపారం మాత్రం రోడ్డుపైనే జరుగుతోంది. దీంతో రాష్ట్రంలోనే ఆదర్శంగా, రూ.30 కోట్ల వ్యయంతో ఆరు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన సమీకృత మార్కెట్ ప్రస్తుతం అలంకార ప్రాయంగా మారింది. నాన్‌వెజ్, పూల మార్కెట్ మినహా, పండ్లు, కూరగాయల దుకాణాలు మళ్లీ రోడ్డుపైకి చేరాయి. దీంతో మార్కెట్ లోపల ఉన్న వ్యాపారులు నష్టపోవడంతో పాటు, రోడ్డుపై వెళ్లే వాహనదారులు, సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వారాంతపు సంత రోజుల్లో భారీ ట్రాఫిక్‌కు సమస్య ఏర్పడుతోంది. గత ప్రభుత్వ హయాంలో రోడ్డుపై ఒక్క వ్యాపారి కూడా వ్యాపారం చేయకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకునేవారు. కానీ, ప్రస్తుతం మార్కెటింగ్ శాఖ, ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు, ఆర్‌అండ్‌బీ అధికారులు తైబజార్ వ్యాపారుల కోసమే చూసీచూడనట్లుగా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నడవాలంటేనే నరకం

ప్రస్తుతం రోడ్డుపై డివైడర్‌కు నాలుగు అడుగుల మేర, ఫుట్‌పాత్‌కు నాలుగు అడుగుల మేర కూరగాయలు, ఇతర సామాగ్రి దుకాణాలు పెడుతున్నారు. మధ్యలో మిగిలిన నాలుగైదు అడుగుల రోడ్డులో పాదచారులు, వాహనదారులు వెళ్లాల్సి వస్తుంది. దీంతో ఒక్క వాహనం ఆగినా మొత్తం ట్రాఫిక్ జామ్ అవుతోంది. వెనుక ఉన్న వాహనదారులు, పాదచారులు వాహనాల మధ్యలో నుంచి నడవాలంటే అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని వెళ్తున్నారు. ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సంతలో అటు పిక్‌ప్యాకేటర్లు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తుండగా, ఇటు వాహనాలు పాదచారులను తాకడంతో చిన్న చిన్న గాయాలవుతున్నాయి. ఇందిరా పార్కు చౌరస్తా నుంచి ఢిల్లీ వాలా హోటల్ వరకు వెళ్లాలంటే వాహనదారులకు తలప్రాణం తోకకు వస్తున్న పరిస్థితి నెలకొంది. రోడ్డుపై వ్యాపారం జరగడంతో మార్కెట్ లోపల ఉన్న వ్యాపారస్తులు వ్యాపారం లేక నష్టపోతున్నామని వాపోతున్నారు.



గజ్వేల్ మార్కెట్ రోడ్డుపై కూరగాయల విక్రయం

కార్ల పార్కింగ్ అడ్డాగా..

గజ్వేల్ పట్టణంలో ప్రధాన కూడలిలో నిర్మించిన సమీకృత మార్కెట్ తూర్పు వైపున పెద్ద ఎత్తున ఖాళీ స్థలం ఉంది. అక్కడ కూరగాయలు, ఇతర వ్యాపారులకు అవకాశం కల్పిస్తే రోడ్డుపై దుకాణాలు పెట్టకుండా అడ్డుకోవచ్చు. దీంతో ట్రాఫిక్ సమస్యతో పాటు చిన్న చిన్న ప్రమాదాలకు పరిష్కారం దొరుకుతుంది. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన మార్కెట్‌లో స్టాళ్లు ఉండగా, రోడ్డుపై కూరగాయలు పెట్టించడం పట్ల అధికారులపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. తైబజార్ వ్యాపారుల నుంచి అధికారులు నెలనెలా మామూళ్లు తీసుకుంటూ, వారికి వ్యాపారానికి అవకాశం కల్పిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

మార్కెట్ సౌకర్యం ఉన్నా రహదారిపైనే అమ్మకాలు

పరిష్కారం చూపాలి



మార్కెట్‌ను రూ.30 కోట్లతో ప్రజలకు తాజా కూరగాయలు అందించాలని ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం కూరగాయలు, పండ్ల బండ్లు, తోపుడు బండ్లు రోడ్డు మీదకు రావడంతో ట్రాఫిక్ సమస్యతో పాటు అనేక సమస్యలు వస్తున్నాయి. అధికారులు వెంటనే స్పందించి పరిష్కారం చూపాలి.

\- గోళి సంతోష్‌కుమార్, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ నాయకులు

రైతులు, చిరు వ్యాపారులకు కేటాయించాలి



మార్కెట్‌లో నిర్మానుష్యంగా ఉండి, కార్ల పార్కింగ్ చేసే అడ్డాగా మారిపోయింది. రోడ్డుపై కూరగాయలు రావడంతో ట్రాఫిక్ సమస్య, పాదచారుల ఇబ్బందులు పెరుగుతున్నాయి. అధికారులు వెంటనే స్పందించి మార్కెట్‌లోని స్టాళ్లలో విక్రయాలు సాగేలా చూడాలి. అవసరమైతే మార్కెట్‌లో ఖాళీగా ఉన్న స్థలాన్ని రైతులకు, వీధివ్యాపారులకు కేటాయించాలి.

-సుభాష్ చంద్రబోస్, బీజేపీ నాయకులు

న్యూస్ బాక్స్

'చదువుల్లో రాణించాలి'

చిలప్‌చెడ్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ ఆకాంక్షించారు. మండల పరిధిలోని చిట్కుల్ కస్తూర్బా పాఠశాలను సందర్శించారు. తరగతి గదులు, పరిసరాలను, వంటగదిని పరిశీలించారు.

భూసార పరీక్ష కార్డులు పంపిణీ

చేగుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : భూసార పరీక్షలకు అనుగుణంగా రైతులు ఎరువులు, పంటల సాగు చేసుకోవాలని రామాయంపేట సహాయ సంచాలకుడు రాజ్‌నారాయణ పేర్కొన్నారు. మంగళవారం నార్సింగి రైతువేదికలో మండలంలోని 1,974 మంది రైతులకు భూసార పరీక్ష కార్డులు పంపిణీ చేశారు.

'పేట'లో డాగ్‌స్క్వాడ్ తనిఖీలు

పెద్దశంకరంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేటలోని బస్టాండ్ మార్కెట్, పలు వ్యాపార దుకాణాలు, దాబాల్లో నార్కోటిక్ డాగ్ ద్వారా మంగళవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మత్తు పదార్థాల రవాణ, విక్రయం జరిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి హెచ్చరించారు.

నిబంధనలు పాటించాలి

నారాయణఖేడ్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వీధి వ్యాపారులు నిబంధనలను విధిగా పాటిస్తూ వ్యాపారాలు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ సూచించారు. మంగళవారం ఖేడ్‌లోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా విభాగం ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని వీధి వ్యాపారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి గుర్తింపుకార్డులు అందజేశారు.

అరుణాచలానికి అయ్యప్పల మహాపాదయాత్ర

సంగారెడ్డి అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి నుంచి శబరిమలకు మహాపాదయాత్రగా బయలుదేరిన అయ్యప్పస్వాముల బృందం మంగళవారం అరుణాచలానికి చేరుకున్నది. సాహితి రాము గురుస్వామి ఆధ్వర్యంలో గతనెల 6న సంగారెడ్డిలోని నవరత్నాలయ దేవస్థానం నుంచి పాదయాత్ర బయలుదేరిన విషయం తెలిసిందే. అరుణాచలగిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న అయ్యప్పస్వాముల బృందం శబరిగిరి వైపు పయనమయ్యారు.

రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దు

పాపన్నపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రోడ్లపై ధాన్యం ఆరబోసి ప్రమాదాలకు కారణమైతే చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. మంగళవారం ఆయన ఎల్లాపూర్ వద్ద ధాన్యం ఆరబోసిన రైతులతో మాట్లాడారు. రైతులు తమ ధాన్యాన్ని రోడ్లపై ఆరబోయడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా వేరేచోట ధాన్యం ఆరబోసుకోవాలని సూచించారు.

భారీ వాహనాలపై చర్యలు తీసుకోవాలి : సీపీఎం

కంది, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో అధికలోడ్‌తో వెళ్తున్న భారీ వాహనాలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. మంగళవారం సాయంత్రం కందిలోని సంగారెడ్డి జిల్లా ఆర్టీఏ కార్యాలయంలో సూపరింటెండెంట్ శ్రీకాంత్, ఎంవీఐ అరుణకు సీపీఎం ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం అందజేశారు.

భూసార పరీక్షలకు కల్హేర్ ఎంపిక

కల్హేర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : భూమిలో ఉన్న సారాన్ని బట్టి పంటలు వేసే దిశగా రైతులను అవగాహన పరిచేందుకు కృషి చేస్తున్నామని, ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లాలో కల్హేర్ మండలం భూసార పరీక్షలకు ఎంపికైనట్లు నారాయణఖేడ్ వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడీఏ) నూతన్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని క్రిష్టాపూర్ రైతువేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.

ఉత్తమ పీఎంశ్రీ పాఠశాలగా ముస్తాపూర్

అల్లాదుర్గం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోని పీఎంశ్రీ పాఠశాలల్లో అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రమేష్ తెలిపారు. హైదరాబాద్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్రస్థాయిలో జరిగిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో పాఠశాల రాష్ట్ర విద్యా సంచాలకులు నవీన్ నికోలాస్ ముస్లాపూర్ ఉన్నత పాఠశాల పీఎంశ్రీ కింద ఎంపికైనట్లు ప్రకటించారన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రమేష్‌ను నవీన్ నికోలాస్, ఏఎస్‌పీడీ రాధారెడ్డి, జేడి రాజీవ్, వెంకటనర్సమ్మ సన్మానించారు.

సేవ చేయడం గొప్ప విషయం

మనోహరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ విద్యార్థులకు సహాయం చేయడం గొప్ప విషయమని మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు అన్నారు. మనోహరాబాద్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మహిపాల్‌రెడ్డి వారి తల్లిదండ్రులు లక్ష్మి, రాంరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మండలంలోని రామాయపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు.

పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటులో పదేళ్ల కృషి : ఎమ్మెల్యే

పటాన్‌చెరు/రామచంద్రాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గానికి పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలంటూ పదేళ్ల పాటు నిత్యం అధికారులకు చేసిన విన్నపాలు ఫలించాయని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు మున్నూరుకాపు సంఘం హాల్‌లో పాలిటెక్నిక్ కళాశాల మొదటి ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని దీప ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. దేశంలో అతిపెద్ద పారిశ్రామికవాడగా పేరుందని వివరించారు. చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి యువకులు ఉపాధి కోసం వస్తుంటారని తెలిపారు. వారికి కావాల్సిన నైపుణ్యంపై శిక్షణ ఇస్తే జీతభత్యాలు పెరుగుతాయని అన్నారు. అందుకే తాము 10 ఏళ్లుగా నిర్విరామంగా పోరాటం చేశామన్నారు. శాశ్వత భవనం నిర్మించడానికి 10 ఎకరాల స్థం కేటాయింపులు జరిగాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, శ్రీనివాస్, నాగరాజు, బాబావలి, వెంకటేష్, బోజయ్య, అశోక్, రాజు, షకీల్, రామిశెట్టి పాల్గొన్నారు. అలానే పటాన్‌చెరు క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 19 మంది లబ్ధిదారులకు రూ.7.22 లక్షల చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నర్సింహారెడ్డి పాల్గొన్నారు. అలాగే తెల్లాపూర్ మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి రూ. 7.2 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం వెలిమెలతండా, కొల్లూరు, ఉస్మాన్‌నగర్, ఇంద్రానగర్‌లలో సీసీరోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం మాజీ చైర్మన్ బి.రాములుగౌడ్, కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి, డీఈఈ సత్యనారాయణ, ఏఈ మోనిక, నాయకులు పాల్గొన్నారు.



పటాన్‌చెరు పాలిటెక్నిక్ కళాశాల ఫ్రెషర్స్‌డేను ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం : రోహిత్‌రావు

నిజాంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం 22 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, సబ్సిడీపై రైతులకు మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేసి మాట్లాడారు. పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు కల్యాణలక్ష్మి పథకం గొప్ప వరంలాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాజిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రమ్యశ్రీ, కాంగ్రెస్ నాయకులు వెంకటేష్‌గౌడ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించండి

● జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర

సంగారెడ్డి క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 15న జరిగే ప్రత్యేక లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీ చంద్ర కోరారు. జిల్లా కోర్టులో మంగళవారం బ్యాంకు, చిట్ ఫండ్, ఇన్సూరెన్స్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక లోక్ అదాలత్‌లో మోటార్ వెహికిల్ ప్రమాద కేసులు, బ్యాంకు మొండి బకాయి కేసులు, చిట్ ఫండ్ కేసులు పరిష్కరించాలన్నారు. రాజీకి అనువైన కేసులన్నీ రాజీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ నర్సింగ్‌రావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భవానీచంద్ర

స్పెషల్ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మెదక్ అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 15న జరుగనున్న స్పెషల్ లోక్ అదాలత్‌ను కక్షిదారుల సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కేసులను సమర్థవంతంగా పరిష్కరించేందుకు న్యాయవ్యవస్థతో సమన్వయం అవసరమన్నారు. ప్రతి అధికారి బాధ్యతతో వ్యవహరిస్తే బాధితులకు న్యాయం అందుతుందన్నారు. పోలీస్‌స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసులు వివరాలపై సమీక్షిస్తూ.. రాజీపడదగిన కేసులు ఈనెల 15న జరిగే లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరేందర్‌గౌడ్, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు నిరోధించడం అందరి బాధ్యత

సంగారెడ్డి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మత్తు పదార్థాలను నిరోధించడం మనందరి బాధ్యత అని డీఆర్‌వో పద్మజారాణి అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. మాదక ద్రవ్యాల రవాణా, వినియోగం పెను సవాల్‌గా మారిందన్నారు. కమిటీలు నామమాత్రంగా ఉండకుండా బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఎక్సైజ్, వైద్యారోగ్య శాఖలు సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పోలీసు అధికారులు అనుమానాస్పద ప్రాంతాల్లో నిఘా పటిష్టం చేసి మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో డీఈవో వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌వో పద్మజారాణి

రెండోరోజూ ప్రైవేటు కాలేజీలకు తాళాలు

సంగారెడ్డి అర్బన్/జహీరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల నిరవధిక బంద్ కొనసాగుతున్నది. సంగారెడ్డి జిల్లాలో సుమారు 16 డిగ్రీ, పీజీ కళాశాలలు రెండోరోజు కూడా నిరవధిక బంద్ చేపట్టాయి. కళాశాలలకు తాళాలు వేసి బకాయిలు విడుదల చేయాలని యాజమాన్యాలు నినదించారు. జహీరాబాద్‌లో జాగృతి, వశిష్ట, ఆచార్య తదితర కళాశాలలకు చెందిన యాజమాన్యాలు బంద్ పాటించాయి. ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ సిద్ధారెడ్డి, హరికుమార్, భానుప్రకాష్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులను చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో తప్పని పరిస్థితుల్లో బంద్ పాటిస్తున్నామన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు విశ్వేశ్వర ఆలయం ముస్తాబు

నారాయణఖేడ్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ పట్టణంలోని శివనగర్ కాలనీలో నిర్మించిన శ్రీ విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనల కోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. నేటి నుంచి 7 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల్లో రాంపూర్ ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి, కొండాపూర్ ఆశ్రమపీఠాధిపతి సంగ్రాం మహరాజ్, పండరిపూర్ పీఠాధిపతి అంబాదాస్ మహరాజ్, కరణ్ గజేంద్ర భారతి మహరాజ్, భర్దీపూర్ పీఠాధిపతి అవదూత్‌గిరి మహరాజ్, మల్లన్నగుట్ట మహరాజ్ బసవలింగ అవదూత్, బీచ్కుంద పీఠాధిపతి సోమలింగశివాచార్య, దెగ్లూర్ పీఠాధిపతి చంద్రశేఖర్ మహరాజ్, గురుసిద్ధ మణికంఠ శివాచార్య మహాస్వామి, తదితరులు పాల్గొంటారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం

రామచంద్రాపురం టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పుణ్యక్షేత్రాలు వెళ్లడానికి ఆర్టీసీ వారు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తుందని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. మంగళవారం రామచంద్రాపురంలో ఆర్టీసీ అధికారులతో కలిసి మాట్లాడారు. దూరప్రాంతాలకు వెళ్లే సమయంలో బాధ్యత కలిగిన ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయాలని కోరారు. ప్రవేటు ట్రావెల్స్ విషయంలో దూకుడుతో బాధ్యత ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, హెచ్‌సీయూ డిపో మేనేజర్ శ్రీనాద్‌గౌడ్, ఎండీ ఇషాక్, ఎండీ.అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

పశుపోషణలో జాగ్రత్తలు పాటించాలి

● జిల్లా పశువైద్యాధికారి ఆదిత్య వర్మ

రాయికోడ్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పశు పోషణలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుని, పశు సంపదను వృద్ధి చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి ఆదిత్య వర్మ అన్నారు. మంగళవారం రాయికోడ్ మండల పరిధిలో ధర్మాపూర్ గ్రామంలో గాలికుంటు నివారణ శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రాయికోడ్‌లోని పశువైద్యశాలను తనిఖీ చేసి, రికార్డును పరిశీలించి మాట్లాడారు. రాయికోడ్‌లోని పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకోవడంతో జిల్లా అధికారులకు నివేదికలు పంపించామని, నిధులు మంజూరైన వెంటనే కొత్త భవనం పనులు ప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి పాండియన్ సిబ్బంది దేవిదాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ప్రశాంతతకు దోహదం

● జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్

జహీరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసిక ప్రశాంతతకు దోహదపడుతాయని జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్ పేర్కొన్నారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని అల్లీపూర్‌లో గల శ్రీక్రిష్ణవేణి గ్రూప్‌ఆఫ్ పాఠశాలలో విద్యార్థులకు వివిధ అంశాలపై క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలన్నారు. అనంతరం విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అశ్రునయనాల మధ్య సందీప్‌కుమార్ అంత్యక్రియలు



కల్హేర్‌లో సందీప్‌కుమార్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి

కల్హేర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్య చేసుకున్న కానిస్టేబుల్ సందీప్‌కుమార్ అంత్యక్రియలు మండల కేంద్రమైన కల్హేర్‌లో మంగళవారం అశ్రునయనాల మధ్య జరిగాయి. సంగారెడ్డి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కొటారి సందీప్‌కుమార్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసై, అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక జీవితంపై విరక్తి చెంది జిల్లా కేంద్రమైన సంగారెడ్డి శివారులోని మహబూబ్‌సాగర్ చెరువు కట్టపై రివాల్వర్‌తో కాల్చుకుని సోమవారం ఆత్మహత్య చేసుకున్న సంగతి విదితమే. మంగళవారం తెల్లవారుజామున భౌతికకాయం పోలీసు బందోబస్తు నడుమ కల్హేర్‌కు చేరుకుంది. సందీప్ మృతదేహాన్ని చూసి గ్రామస్థులు బోరున విలపించారు. సందీప్‌కుమార్ భౌతిక కాయానికి నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, కంగ్టి సీఐలు డి.వెంకట్‌రెడ్డి నివాళులర్పించారు. ఎస్పీ ఆదేశాల మేరకు అంత్యక్రియలకు రూ.25 వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్హేర్, సిర్గాపూర్, నాగల్‌గిద్ద, సంగారెడ్డి టౌన్ ఎస్ఐలు నారాయణ, మహేష్, హరిక్రిష్ణ, సర్దార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అయితే సందీప్‌కుమార్‌కు తల్లి భూదేవి తలకొరివి పెట్టింది.

ఉద్యోగ విరమణ తప్పదు

● ఎంఈవో నీరజ

చేగుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదని ఎంఈవో నీరజ పేర్కొన్నారు. మండల పరిధిలోని మక్కరాజ్‌పేట్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అమర్‌శేఖర్‌రెడ్డి ఉద్యోగ విరమణకు మంగళవారం ఆమె హాజరై మాట్లాడారు. అమర్‌శేఖర్‌రెడ్డి పాఠశాల, విద్యార్థుల అభివృద్ధి కోసం కృషి చేశారన్నారు. అనంతరం 250 మంది విద్యార్థులకు ప్లేట్లు అందజేశారు. అనంతరం అమర్‌శేఖర్‌రెడ్డి దంపతులను పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యయులు వెంకట్‌రాంరెడ్డి, ఉపాధ్యాయ బృందం, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పూలమాల, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి ఎంఈవో గంగాబాయి, మాజీ సర్పంచ్ కుమ్మరి శ్రీనావాస్, విద్యా కమిటీ చైర్మన్ సుజాత, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో మిలీనియం మహనీయుల గ్రంథ ఆవిష్కరణ

నారాయణఖేడ్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రసగీతి సాహితీ సాంస్కృతిక వేదిక వ్యవస్థాపకుడు మహారెడ్డి మహిపాల్‌రెడ్డి సంకలనం చేసిన గ్రంథాన్ని మంగళవారం నారాయణఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అష్టావధాని భానుప్రకాష్, సాహితీ మిత్ర మండలి సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. అనంతరం మహిపాల్‌రెడ్డికి సాహితీ కళాపోషక బిరుదును ప్రదానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మహేశ్వర్, గెజిటెడ్ హెచ్‌ఎంలు మన్మథకిషోర్, యాదవరెడ్డి, సాహితీ మిత్ర మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరును ఎండగట్టే వార్తలు రాసే దమ్ముందా..?

● సొంత నిధులతో పనులు చేస్తున్నాం

● నీటి పారుదల శాఖ డీఈఈ సుబ్బలక్ష్మి

అల్లాదుర్గం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సరైన వసతులు, సౌకర్యాలు లేని ప్రభుత్వం కార్యాలయ భవనాల్లో విధులు నిర్వర్తిస్తుంటే తమ అవస్థలను వెలుగులోకి తేకుండా.. తమ తప్పొప్పులపై కథనాలు రాస్తున్న విలేకర్లు.. ప్రభుత్వ తీరును ఎండగట్టే వార్తలు రాసే దమ్ముందా.. అని నీటి పారుదల శాఖ డీఈఈ సుబ్బలక్ష్మి విలేకరులను ప్రశ్నించారు. ఈ నెల 2న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'అధికారులుంటే ఒట్టు..!' అన్న కథనంపై జీర్ణించుకోలేని ఆమె మంగళవారం వివరణ ఇచ్చారు. స్థానిక సబ్ డివిజన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సబ్ డివిజన్ కార్యాలయం అరకొర వసతులతో ఎలాంటి వసతులు, సౌకర్యాలు లేని భవనంలో కొనసాగుతుంది. ఈ భవనంలో కమ్యూనికేషన్ సదుపాయాలు అంతంతమాత్రంగా ఉండటంతో ఇతర ప్రాంతాల్లో తమ పనులు నిర్వహించాల్సి వస్తుందన్నారు. ఈ భవనంలో ఫోన్ సిగ్నల్ కూడా అందకపోవడం తమ పనులకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వం నిర్వహణకు సంబంధించిన నిధులు విడుదల చేయకపోవడంతో తమ సొంత నిధులతో పనులు సాగిస్తున్నామని తెలిపారు. తాము కార్యాలయంలో ఉండాల్సిన పని లేదని ఫీల్డ్ మీద ఉంటామని వివరించారు.



మాట్లాడుతున్న సుబ్బలక్ష్మి

పరిశ్రమ నిర్మాణంపై డీఎల్పీవో విచారణ

హత్నూర, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : హత్నూర మండలం చందాపూర్ గ్రామ శివారులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న పరిశ్రమ నిర్మాణాలపై డీఎల్పీవో అనిత మంగళవారం విచారణ చేశారు. పరిశ్రమ పూర్తిస్థాయిలో అనుమతులు తీసుకోకుండానే నిర్మాణం పనులు చేపట్టడం వల్ల రెండురోజుల క్రితమే గ్రామపంచాయతీ కార్యదర్శి నోటీసులు సైతం జారీ చేసిన విషయం తెలిసిందే. పరిశ్రమ నిర్మాణాలను డీఎల్పీవో పరిశీలించి విచారణ చేపట్టారు. అనుమతులు తీసుకున్న తర్వాతే నిర్మాణాలు ప్రారంభించాలని ఆదేశించారు.

హైవే భద్రమేనా?

(3వ పేజీ తరువాయి)

నడుపుతుండటంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

కనిపించని సూచిక బోర్డులు

జాతీయ రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నా ఎక్కడా ప్రమాద సూచికలు కనిపించడం లేదు. ఎక్కడ ఇరుకుగా ఉందో, ఎక్కడ మలుపు ఉందో, ఎక్కడ గుంత ఉందో తెలియక వాహనచోదకులు తికమక పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదాలబారిన పడుతున్నారు. రోడ్డు నిర్మాణ మెటీరియల్ రోడ్డుపై వదిలేయడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

యువత ఉపాధి కల్పించేస్థాయికి ఎదగాలి

సంగారెడ్డి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : యువత ఉద్యోగాల కోసం వెతకడం కాకుండా ఉద్యోగాలు, ఉపాధి కల్పించేస్థాయికి ఎదగాలని అదనపు కలెక్టర్ చంద్రశేకర్ అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన యువజన ఉత్సవాల సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. యువజనోత్సవాల్లో భాగంగా వివిధ కళా పోటీలు, సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమాధికారి ఖాసీం బేగ్, యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణుగోపాల కృష్ణ పాల్గొన్నారు.

కాలనీల్లో నీటి కొరత నివారణ

రామచంద్రాపురం టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో నీటికొరత తీర్చడానికి ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. మంగళవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి సాయినగర్ కాలనీలో బోరు వేయించే పనులు ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రానున్న వేసవి నీటికొరత లేకుండా నివారణ చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమసంఘం అధ్యక్షుడు వీరశెట్టి, గోవర్ధన్‌రెడ్డి, బ్రహ్మరాజు, రాజ్‌కుమార్, సంగప్ప, శంకర్, నాగరాజు, భాస్కర్, శ్రావణ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

చిన్నశంకరంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా విజన్ ఎన్జీవో కమ్యూనిటీ మొబైల్ లేబర్ అధికారి యాదగిరి అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేట మండలంలోని వెంట్రావుపల్లిలో గ్రామపంచాయతీ కార్యదర్శి పద్మ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన అమ్మాయికి, 21 ఏళ్లు నిండి ఉన్న అబ్బాయికి వివాహం చేయాలని, చిన్న వయసులో చేయడం వల్ల అమ్మాయిలకు ఆరోగ్య సమస్యలు, పుట్టే పిల్లలకు పౌష్టికాహారలోపంతో ఉంటారన్నారు.

నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మునిపల్లి/సంగారెడ్డి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరంలాంటిదని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్, మాజీ ఎంపీపీ రాంరెడ్డి అన్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను మంగళవారం మునిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రసూల్ పటేల్, ఏపీసీఎస్ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ ఎంపీటీసీలు బుర్కుల పాండు, యాదయ్య, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు. కొండాపూర్ మండలానికి చెందిన పూలి ప్రియాంకకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల అధ్యక్షుడు మ్యాకం విఠల్ అందజేశారు.

మల్లికార్జునస్వామి ఆలయానికి విరాళాలు

మునిపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కంకోల్, మొగ్దుంపల్లి గ్రామాల శివారులో నిర్మిస్తున్న భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణానికి తమవంతుగా దాతలు ముందుకొచ్చిన విరాళాలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మునిపల్లి ఎంపీపీ గౌడిగామ శైలజశివశంకర్, కంకోల్ గ్రామానికి చెందిన గౌడిగామ సంగమేశ్వర్ తమవంతుగా రూ.2 లక్షలు చొప్పున రూ.4 లక్షల నగదును ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

కల్యాణలక్ష్మితో పేదల జీవితాల్లో వెలుగులు

పుల్‌కల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లన్నగారి దుర్గారెడ్డి అన్నారు. ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ రాంసాని రామచంద్రారెడ్డితో కలిసి మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 39 మందికి కల్యాణలక్ష్మి, ఐదుగురికి షాదీముబారక్ మొత్తం 44 మంది లబ్ధిరులకు ఒక్కొక్కరికి రూ.లక్షా 116 చొప్పున రూ.44.5 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. అలాగే 44 మందికి సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.16,56,500 లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా గరుడవాహన సేవ, కల్యాణోత్సవం

నారాయణఖేడ్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సంజీవన్‌రావుపేట అనంతశయన ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం 5వ రోజున గరుడవాహన సేవతో పాటు కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు ప్రవీణ్‌చారి ఆధ్వర్యంలో ఉదయం నుంచి అభిషేకం, హారతి నిర్వహించారు.

వేలంలో రూ.3.18 లక్షల ఆదాయం

నారాయణఖేడ్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వివిధ కేసుల్లో పట్టుబడిన బైకులను, మొబైల్ ఫోన్లను మంగళవారం వేలం వేయడంతో ప్రభుత్వానికి రూ.3,18,940 లక్షల ఆదాయం వచ్చిందని ఎక్సైజ్ సీఐ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఐదు బైకులను వేలం వేయాల్సి ఉన్నప్పటికీ నాలుగు బైకులను వేలం వేశామని, వీటి ద్వారా జీఎస్టీతో కలిపి రూ.2,51,340 లక్షలు వచ్చాయని, 8 మొబైల్ ఫోన్లను వేలం వేయగా రూ.67,600 వేలు వచ్చాయన్నారు. వేలం పాటలో 42 మంది పాల్గొన్నారన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో లక్ష ఒత్తుల హోమం

పెద్దశంకరంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం పురస్కరించుకొని పెద్దశంకరంపేటలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో లక్ష ఒత్తుల హోమం నిర్వహించారు. వైకుంఠ చతుర్థశి సందర్భంగా లక్ష్మీనారాయణ కల్యాణోత్సవం, లక్ష్మీనారాయణ హోమంతో పాటు ఉసిరి తులసి చెట్లకు ప్రత్యేక పూజలు చేశారు.

చోరీ కేసులో ఇద్దరికి రిమాండ్

జోగిపేట రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆటో చోరీ చేసిన కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జోగిపేటకు చెందిన శ్రీకాంత్ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆటోను నిలిపి లోపలికి వెళ్లాడు. ఆస్పత్రి నుంచి బయటకొచ్చేసరికి ఆటో కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మండలంలోని అల్మాయిపేట వద్ద మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆటోను గుర్తించి అందులోని వ్యక్తులను విచారించగా పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన డప్పు అశోక్, మాసానిపల్లి గ్రామానికి చెందిన బంటు విష్ణులు తామే ఆటోను దొంగలించినట్లు విచారణలో ఒప్పుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అనిల్‌కుమార్ తెలిపారు.